క్లుప్తంగా

జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న జీపీ కార్మికులు

నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల సమ్మె విరమించిన గ్రామపంచాయతీ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ శనివారం తెలిపారు. ముధోల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జీపీ కార్మికులను విధుల్లోకి తీసుకోకుండా పంచాయతీ సెక్రటరీ, సర్పంచ్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నరన్నారు. ఇప్పటికైనా కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

ట్రాక్టర్‌ను అడ్డుకున్న కార్మికులు

ముధోల్ : సమ్మె చేసి మంత్రి హామీతో సమ్మె విరమించిన పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోకపోవడంపై కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. శనివారం పారిశుధ్య పనుల ట్రాక్టర్‌ను అడ్డుకొని వెంటనే తమను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్మీ జవాన్‌కు సన్మానం

ముధోల్: అమృత్ మహోత్సవంలో భాగంగా మేర మట్టి–మేర దేశ్ కార్యక్రమంలో శనివారం మండల కేంద్రంలో స్థానిక యువకులు ఆర్మీ జవాన్ విష్ణుప్రసాద్‌గౌడ్‌ను సన్మానించారు. దేశ సేవ కోసం అందరూ కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నల్ల రమేష్, ఎంపీటీసీ దేవోజీ భూమన్న, పోతన్న, ఉరమేష్, దశరథ్, జీవన్ ఉన్నారు.

వేంకటేశ్వరస్వామి పల్లకీసేవ



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు..

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని అతి పురాతనమైన దేవరకోట లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో శనివారం పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రైతులను ఆదుకోవాలని వినతి



ఎమ్మెల్యేను కలిసిన రైతులు

కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పెంచకల్‌పాడ్ గ్రామంలో రోడ్లు చెడిపోయాయని, పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఆదుకోవాలని ఉపసర్పంచ్ కిష్టయ్య ఆధ్వర్యంలో శనివారం రైతులు ఎమ్మెల్యే విఠల్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. గ్రామంలో రెండు వందల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని వాపోయారు. భైంసా మండలంలోని తిమ్మాపూర్ నుంచి కుంటాల మండలం విఠాపూర్ రోడ్డు వరకూ మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎమ్మెల్యే సానుకులంగా స్పందించినట్లు వారు తెలిపారు.

విక్రమ్ సారాబాయి జయంతి

కుంటాల: మండల కేంద్రమైన కుంటాలలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం భారత అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన భౌతికశాస్త్రవేత్తగా ఎన్నో సేవలు చేశారన్నారు. ఆయన ఫాదర్ ఆఫ్ ఇండియన్ స్పేస్‌గా పేరొందరన్నారు. ప్రిన్సిపాల్ సంతోష్, కరస్పాండెంట్ ప్రవీణ్ ఉన్నారు.

శిక్షణతో నాణ్యమైన విద్య



మాట్లాడుతున్న ఎంఈవో సుభాష్

భైంసాటౌన్: ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో సుభాష్ అన్నారు. భైంసాలోని కిసాన్‌గల్లి శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల శిశుమందిరాల ఆచార్యులకు రెండురోజుల శిక్షణ శనివారం ప్రారంభించి మాట్లాడారు. విద్యాబోధనలో బోధనోపకరణాలు, సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. శ్రీసరస్వతి విద్యాపీఠం దక్షిణమధ్య క్షేత్ర ప్రశిక్షణ ప్రముఖ్ రావుల సూర్యనారాయణ శిక్షణ ఇచ్చారు. విభాగ్ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి నాగాచారి, జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, ఉపాధ్యాయులున్నారు.

గల్లీకో బెల్ట్‌షాప్..

- పట్టణంలో సుమారు 20కిపైగానే..
- టెండర్లు వేసి బెల్ట్‌షాపుల నిర్వహణ
- 24 గంటలు అందుబాటులోనే..
- మద్యానికి బానిసలుగా మారుతున్న యువతరం
- నామమాత్రంగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



సోఫీనగర్‌లోని బెల్ట్‌షాప్ వద్ద మద్యం ప్రియులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ పట్టణంలో ఏ గల్లి చూసినా.. బెల్ట్ షాపులు లేని గల్లీ కానరాదు. రాత్రి పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా అధిక ధరలకు అక్రమంగా మద్యం విక్రయిస్తూ మద్యం ప్రియుల జేబులు ఖాళీ చేస్తున్నారు. బెల్ట్‌షాపుల నియంత్రణకు కృషి చేయాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పలువురు మద్యానికి బానిసై కుటుంబాలను వీధిన పడేస్తున్నారు. ఇకనైనా బెల్ట్‌షాపును అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

బెల్టు షాపుల జోరు...

పట్టణంలోని సోఫీనగర్, వైఎస్సార్‌కాలనీ, మంజులాపూర్, వెంకటపూర్ లాంటి కాలనీలో టెండర్లు వేసి మరి బెల్ట్‌షాపులు కట్టబెడుతున్నారు. అలాగే దగవాడ, బాలాజీవాడ, కురన్నపేట్, శాంతినగర్, వెంకటాపూర్, ప్రియదర్శినగర్, రాంనగర్, సిద్దాపూర్, బంగల్ పేట్, మహాలక్ష్మి వాడ ప్రాంతంలో జోరుగా బెల్ట్ షాపులు కొనసాగుతున్నాయి. బెల్టు షాపులు తమ ఇష్టారితిన ఎమ్మార్పీపై రూ.30నుంచి రూ.50 పైగానే వసూలు చేస్తూ మద్యం ప్రియుడు నుంచి దండుకుంటున్నారు. ఎప్పుడు తలుపుకోడితే అప్పుడే మద్యం విక్రయిస్తూ 24గంటలు బెల్టుషాపుల్లో అక్రమ దందా కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా బెల్ట్ షాపుల్లో మద్యాన్ని సైతం కల్తీ చేస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారని పలువురు వాపోతున్నారు.

పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

నిర్మల్ పట్టణంలో ఇంతటి బహిరంగంగా బెల్ట్ షాపులు అక్రమంగా మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగానే వ్యవహరిస్తున్నారు. కొనుగోల్లు బాగా జరుగుతున్నాయని అధికారులే బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు అనుకుంటున్నారు. నిజానికి అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మద్యం దుకాణాల ఆదాయం..

నిర్మల్ పట్టణంలో 11 లైసెన్సు మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ మద్యం దుకాణాలలో 1 డిసెంబర్ 2022 నుండి 30 జులై 2023 మధ్యకాలంలో 119కోట్ల 73 లక్షల లిక్కర్ ఆదాయం వచ్చింది.

బెల్ట్‌షాపుల నిర్వహణకు అనుమతి లేదు

నిర్మల్ పట్టణంలో బెల్ట్‌షాపులకు ఎటువంటి అనుమతి లేదని జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎవరైనా బెల్ట్‌షాపులు పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

\- శ్రీనివాస్‌రెడ్డి, నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ సూపరింటెండెంట్

నాసిరకంగా కాలువ మరమ్మతులు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న మాజీ ఎంపీ

ఖానాపూర్: మండలంలోని సదర్‌మాట్ కాల్వతో పాటు సరస్వతీ కాలువ పరిధిలోని ఉప కాల్వలకు గండ్లు పడిన చోట నాణ్యతలోపంతో ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. శనివారం మండలంలోని సదర్‌మాట్ ప్రధాన కెనాల్‌కు గండ్లు పడిన ప్రాంతాలను పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు కమీషన్లు తీసుకోవడంతోనే గుత్తేదార్లు, అధికారులు నాసిరకంగా పనులు చేపడుతున్నారన్నారు. గతంలో పాత ఎల్లాపూర్‌తో పాటు పాత తర్లపాడ్‌లో మరమ్మతులు చేసినప్పటికీ తిరిగి అదే చోట గండ్లు పడ్డాయన్నారు. ఖానాపూర్‌లో కమీషన్ల పాలన పోయే వరకూ ప్రజలకు, రైతులకు తిప్పలు తప్పవన్నారు. గత ఏడాది సైతం వానాకాలం సాగుకు నీరందక అనేక మంది రైతుల భూములు బీల్లుగానే ఉన్నాయని, ఈసారి సైతం బీల్లుగానే ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. పంటలు వేయక నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాయిని సంతోశ్, ఆకుల శ్రీనివాస్, తోకల బుచ్చన్న, నల్ల రవీందర్‌రెడ్డి, మామిడాల సుదాకర్, నల్లూరి శ్రీధర్, పిట్టల భూమన్న, అనిల్‌రావు, ఆసం సాయి, జీవన్, ఒడ్నాల రాజేశ్వర్, శేఖర్, భూమాగౌడ్ ఉన్నారు.

‘గిరిజనబంధు’ను అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కడెం: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు గిరిజన బంధును అమలు చేయాలని బంజార యువజన సంఘం రాష్ట్ర నాయకుడు భుక్యా రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గిరిజన యువతను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఐటీడీఏ ద్వారా అందించే పథకాలను నాన్ ఏజెన్సీ ప్రాంత వాసులకు అందజేయాలని, ట్రైకర్ నిధులను బ్యాంకులు ఎలాంటి పూచికత్తు లేకుండా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బంజార సంఘం నాయకులు రామారావునాయక్, రాందాస్, గంగారాం ఉన్నారు.

అన్ని కులాలకు ‘బీసీబంధు’ ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీబంధు అన్నికులాలకు అందజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నం నారాయణగౌడ్ అన్నారు. శనివారం ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీబంధు అన్ని కులాలకు ఇవ్వాలని కోరుతూ డాక్టర్ అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులాలకు లక్షలోను మంజూరు చేసేందుకు కఠినమైన నిబంధనలు పెట్టి కొందరికే అందజేస్తున్నారని, మైనార్టీలో అందరికి లక్ష లోను అందజేశారన్నారు. తొమ్మిది సంవత్సరాల నుంచి ఎలాంటి లోన్లు ఇవ్వకుండా అణిచివేసి ప్రస్తుతం ఎన్నికల ముందు లక్ష ఆశ చూపి బీసీలను మాయ చేయాలనుకుంటున్నారు. బడ్జెట్‌లో రూ.7వేల కోట్లు నుంచి రూ.2వేల కోట్లు పంచడం సంక్షేమమా, ద్రోహమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు తోట సత్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు ఒడిసేలా శ్రీనివాస్, అయ్యన్నగారి రాజేందర్, హనుమంత్ రాజ్, సంతోష్ రాజ్, ఓబీసీ మోర్చా నాయకులు పోశెట్టి భీమేష్ పాల్గొన్నారు.

బీసీలంటే ప్రభుత్వానికి చిన్నచూపు

భైంసాటౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వానికి బీసీలంటే చిన్నచూపు అని బీజేపీ నాయకులు విమర్శించారు. ఈ మేరకు ఓబీసీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ ఆధ్వర్యంలో భైంసాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నాగనాథ్, పోశెట్టి, కౌన్సిలర్ గౌతం పింగ్లే, తదితరులున్నారు.

బోదకాలు వ్యాధి నివారణ మాత్రల పంపిణీ



మాత్రల పంపిణీలో సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: బోదకాలు వ్యాధి నిర్మూలనకు జిల్లాలో చేపడుతున్న మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమం వంద శాతం పూర్తి చేయాలని జాతీయ కీటక వ్యాధుల నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ రాజా రమేష్ అన్నారు. శనివారం ఆయన బోయవాడ, శాస్త్రినగర్, భాగ్యనగర్‌లో చేపడుతున్న మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాలను సందర్శించారు. జిల్లా డిప్యూటీ విస్తరణ, మీడియా అధికారి రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు భోజా రెడ్డి పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆర్ఎంవో వేణుగోపాలకృష్ణ బోదకాల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను స్వయంగా ఈ మాత్రలు వేసుకున్నానని, ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. హెడ్ నర్స్ శోభ, స్టాఫ్ నర్సులు స్వరూప, వీణ, కవిత, రాధిక, సిబ్బంది పవన్, సాయన్న, యోగేష్, భోజన్న, కిరణ్ పాల్గొన్నారు.

లక్ష్మణచాందలో..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఫైలేరియా మందులు పంపిణీ చేశారు. శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బృందాలుగా విడిపోయి గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ మందులు అందచేశారు. ప్రతీ ఒక్కరు ఫైలేరియా మందులు వేసుకోవాలని సూచించారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్ ప్రేమల, వైద్య సిబ్బంది విజయ తదితరులు ఉన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు



జోనల్‌స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సోన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కడ్తాల్ గ్రామంలో నిర్వహిస్తున్న టెన్నికాయిట్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జోనల్ స్థాయికి ఎంపిక చేశారు. అందులో అండర్ 17 బాలుర విభాగంలో బి.రాజ్‌కుమార్, జె.విగ్నేష్, బి.అజయ్. బి.రోహిత్, బి.లక్ష్మణ్, ఏ.రమాకాంత్, అండర్ – 17 బాలికల విభాగంలో పి.నిఖిత, పి.రామలక్ష్మి, ప్రణీత, ఎస్.స్పందన, ఎన్.రక్షిత, కె.సాక్షి, అండర్–14 బాలుర విభాగంలో బి.దీపక్, వి.గణేష్, డి.సాయికుమార్, ఆర్.మనీకాంత్, కె.నవకిశోర్, ఎస్.మహేశ్, బాలిక విభాగంలో ఎం.మల్లేశ్వరి, కె.సంధ్య, ఎం.చైత్ర, జెడ్పీఎస్ఎస్ కడ్తాల్, పి.సంజన, పి.సంజన, ఎన్.రక్షిత, జి.స్పందన ఎంపికైనట్లు కన్వీనర్ బి.మహేందర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఆర్.వెన్నెల తెలిపారు.

బీసీలోన్లు మంజూరు చేయాలి

సారంగపూర్: చేతివృత్తిని నమ్ముకుని జీవిస్తున్న నాయిబ్రహ్మణులకు ప్రభుత్వం అందిస్తున్న బీసీలోన్లు తక్షణం మంజూరు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 50 నాయీబ్రహ్మణ కుటుంబాలు జీవిస్తున్నాయని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, గౌరవ సలహా సభ్యుడు కిష్టయ్య, సంఘం నాయకులు సతీష్, కిషన్, సాయిబాబ, శేఖర్, శ్రీనివాస్ ఉన్నారు.

మంత్రిని కలిసిన కాల్వ ఆలయ కమిటీ



మంత్రిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన కాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా, పూల మొక్కతో సన్మానించారు. ఇందులో ఆలయ చైర్మన్ పూజారం మహేష్, పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, చిన్న నరసయ్య, ప్రీతంరెడ్డి, విమల, మహేష్, పూదరి శివ ఉన్నారు.

మంత్రికి వినతి

జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘ భవనంలో పలు వసతులు కల్పించాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో పెన్షనర్లు సంఘ భవనాన్ని నిర్మించుకున్నామని, సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సదుపాయాలు ఏర్పాటు చేయాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ముధోల్: ముధోల్ గ్రామానికి చెందిన పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పి.విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేలా తమవంతు కృషి చేస్తామని కార్యకర్తలు పేర్కొన్నారు. అనంతరం ఇటీవల గ్రామంలో మరణించిన రోల్ల సదానంద్ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు.

జీవాలకు టీకాలు

కుంటాల: మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ గజ్జారాం యాదవ్ పేర్కొన్నారు. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు రాకుండా శనివారం కుంటాలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి మాట్లాడారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అర్హులకే ‘డబుల్ బెడ్‌రూమ్’



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: డబుల్‌బెడ్ రూం ఇళ్లను అర్హులకే కేటాయించి స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. శనివారం పట్టణంలోని డబుల్‌బెడ్ రూమ్ ఇల్లను సందర్శించి అక్కడున్నవారితో మాట్లాడారు. ఖానాపూర్ ప్రాంతానికి చెందిన వారందరికీ ఇల్లు వచ్చాకే ఇతర రాష్ట్రాల వారికి అందజేస్తామన్నారు. అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. అనర్హులకు ఇళ్లను కేటాయించారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఈ విషయమై ఎమ్మెల్యే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఎంపీపీ మోహిద్, నాయకులు పుప్పాల శంకర్, గౌర్రె గంగాధర్, రాజగంగన్న, పరిమి సురేశ్, సార్ల సురేశ్, పత్రి నగేశ్, శ్రీనివాస్, త్రీవెందర్, టేకు మధు, నశీర్, మెహరాజ్ ఉన్నారు.

రెండో వసంతంలోకి కిసాన్ ఫ్యాషన్ మాల్



కిసాన్ షాపింగ్‌మాల్‌లో కిక్కిరిసిన రద్దీ

నిర్మల్‌టౌన్: సకుటుంబ సపరివార వస్త్ర ప్రపంచమైన కిసాన్ ఫ్యాషన్ మాల్ నిర్మల్ జిల్లా కేంద్రంలో నెలకొల్పి రెండు వసంతాలను పూర్తి చేసుకుంటోంది. ఈ సందర్భంగా కస్టమర్ దేవుళ్ల సాక్షిగా ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు జరుపుకుంటోంది. కిసాన్ ఫ్యాషన్ మాల్‌లో 12, 13, 14, 15వ తేదీల్లో అంబరాన్ని అంటే సంబురాలు కొనసాగనున్నాయి. ప్రతీ రూ.2,000 కొనుగోళ్లపై స్పాట్ గిఫ్ట్ అందిస్తోంది. ఈ సువర్ణ అవకాశం కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉండనుందని, వస్త్రాభిమానులు సద్వినియోగం చేసుకోవాలని కిసాన్ షాపింగ్ మాల్ యజమాన్యం కోరుతోంది.

చెరువుకు గండి..



కుంటాల: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో అందకుర్ చెరువు పూర్తిగా నిండిపోయింది. ఎడతెరిపి లేకుండా ఇటీవల వర్షాలు కురువడంతో చెరువుకు ఎడమ వైపున గ్రామస్తులు, అధికారుల సూచన మేరకు గండి కొట్టారు. కాగా ప్రస్తుతం అలుగు పక్కన తూముకు గండిపడి చెరువులోని నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

నిరుపేదలకు అండగా ఉండేందుకే కమిటీ

సారంగపూర్: నిరుపేదలకు అండగా నిలిచేందుకే ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ కమిటీ ఉద్దేశమని ఆ సంఘం మండల అధ్యక్షుడు దండు సాయన్న అన్నారు. మండల కేంద్రం సమీపంలోని కరుణాకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శనివారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు, వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించే దిశగా కమిటీ పనిచేస్తుందన్నారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని గ్రామాల్లో కమిటీ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో లింగం, రాజేశ్వర్, రాజన్న, తదితరులు ఉన్నారు.

పాడి రైతులకు రుణాలు

లోకేశ్వరం: మండలంలోని పలువురు పాడిరైతులకు నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ సంస్థ అధికారులు రుణాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా మనేజర్ దస్రునాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో 805 మంది రైతులు విజయ డెయిరీ ద్వారా ముద్ర లోన్‌కు దరఖాస్తు చేసుకున్నారని, వీరిలో 38 మంది దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయిందన్నారు. ఈ రుణాలకు ఎలాంటి మాఫీ వర్తించదన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ అబ్దుల్లాపూర్ మేనేజర్ తిరుమలేశ్, డెయిరీ భైంసా మేనేజర్ గజ్జారాం, సరఫరాదారు రమణారెడ్డి, తదితరులున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

ముధోల్: మండల కేంద్రం ముధోల్‌కు చెందిన రోల్ల సదానంద్ ఇటీవల మరణించగా శనివారం ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈయన వెంట మండల బీఆర్ఎస్ అధ్యక్షులు అఫ్రోజ్‌ఖాన్, నాయకులున్నారు.

ఎంపీపీ పరామర్శ

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్‌రూరల్ మండలంలోని ఎల్లారెడ్డిపేట్ గ్రామానికి చెందిన ఏదుల భీమేష్ (33) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఎంపీపీ కొరిపెల్లి రామేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు. బీఆర్ఎస్ మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ రాము ఉన్నారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో శనివారం గ్రంథాలయ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డి.సంతోష్, కరస్పాండెంట్ బి.ప్రవీణ్ ఉన్నారు.

డాక్టర్ శశికాంత్‌కు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని స్వప్న ఆస్పత్రిలో ఇటీవల సివిల్ సర్జన్‌గా పదోన్నతి పొందిన డాక్టర్ స్వప్న– శశికాంత్ దంపతులకు నిరుద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. నిరుద్యోగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లాండిగే సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు గొండ అజయ్, నికేతన్, శ్రీవాణి, మీనా ఉన్నారు.

12ఎండీఎల్76. క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లోకేశ్వరం: మండలంలోని అర్లి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం హర్షనీయమని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు పాల్గొన్నారు.

నేడు బడ్‌గాంలో వర్షావాజ్

తానూరు: భైంసా మండలంలోని బడ్‌గాం గ్రామంలో ఆదివారం ఉదయం 11గంటలకు భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో వర్షావాజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌బాబు వాగ్మారే తెలిపారు. బుద్ధుడి చరిత్ర వివరించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

సోన్: అజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజా వద్ద నిర్మల్ బీవోటీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మహాలక్ష్మి నేత్ర సంరక్షణ కేంద్రం ఆర్మూర్ కంటి వైద్య నిపుణులు చంద్రశేఖర్ వాహనదారులకు కంటి పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేశారు. బీవోటీ సంస్థ డైరెక్టర్ అవినాశ్‌రెడ్డి, ఎస్ఎచ్ఐ అధికారి వినాయక్ ఉన్నారు.

కోరుట్లలో యుద్ధభేరి సభ

కుభీర్: నేడు కోరుట్లలో జరిగే పద్మశాలి రాజకీయ యుద్ధభేరిని పద్మశాలి కులస్తులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉమాశంకర్ అన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిర్మల్
90106 10882
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
నిర్మల్ మరియు ముథోల్ :
జి.గంగాధర్ - 7997958182
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899